నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
13 | హైదరాబాద్, మంగళవారం 20 ఫిబ్రవరి 2024 | RANGAREDDY

## ఓటరు పెండింగ్ దరఖాస్తులను పరిశీలించాలి

-జిల్లా కలెక్టర్ శశాంక



అధికారులతో సమావేశమైన కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, ఫిబ్రవరి 19(నమస్తే తెలంగాణ) : ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపునకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తుల పరిశీలనను యుద్ధప్రాతిపాదికన పూర్తి చేయాలని కలెక్టర్ శశాంక సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో కలెక్టర్ శశాంక ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, నోడల్ ఆఫీసర్లతో పార్లమెంట్ ఎన్నికలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా పక్కాగా రూపొందేలా అన్ని స్థాయిల్లో పకడ్బందీ పరిశీలన జరపాలన్నారు. ముఖ్యంగా 18-19 సంవత్సరాల వయసు వారు ఏ ఒక్కరూ మిస్ కాకుండా ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. 2024 ఏప్రిల్ 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న వారి నుంచి సైతం దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని గుర్తించే క్రమంలో అదనపు సిబ్బంది సైతం అందుబాటులో ఉండేలా(రిజర్వ్) చర్యలు తీసుకోవాలని, 10 శాతం మేర అదనంగా సెక్టోరల్ అధికారులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. మృతి చెందిన ఓటర్ల పేర్ల తొలగింపు విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని.. క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపించి, మరణ ధ్రువీకరణ పత్రాలను పరిశీలించిన తర్వాతనే ఓటరు జాబితా నుంచి పేరు తొలగించాలని కలెక్టర్ సూచించారు.



## ఆదాయ గనులు

**గనుల శాఖకు లీజుల రూపంలో లక్ష్యానికి మించి ఆదాయం రాక**

**ఈ ఏడాది లక్ష్యం రూ.92కోట్లు.. జనవరి నాటికే రూ.96కోట్లకు పైగా రాబడి**

**మార్చి నాటికి మరో రూ.10కోట్లు రాబట్టేందుకు అధికారుల కార్యాచరణ**

**రంగారెడ్డి జిల్లాలో 95 వరకు క్వార్ట్జ్, గ్రానైట్, కంకర పరిశ్రమలు**

రంగారెడ్డి, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని ఖనిజాలకు దేశ, విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలోనే జిల్లాలోని గనులు, ఖనిజాలు.. సంబంధిత శాఖకు ఈ ఏడాది కూడా భారీ ఆదాయాన్ని తెచ్చి పెట్టాయి. ఈ ఏడాది ఆర్థిక సంవత్సరానికి ఇంకా నెలన్నర రోజుల సమయం ఉండగానే మంచి ఆదాయం అందింది. ఈ ఏడాదికి సంబంధించి ఇప్పటికే లక్ష్యానికి మించి రాబడి వచ్చింది. ఈ ఆర్థిక సంవత్సర లక్ష్యం రూ.92 కోట్లు కాగా, రూ.96కోట్ల(140 శాతం) ఆదాయం సమకూరింది. మార్చి నాటికి అదనంగా మరో రూ.10కోట్ల ఆదాయాన్ని రాబట్టుకునేందుకు సంబంధిత శాఖ అధికారులు కార్యాచరణను రూపొందించుకుని అమలు చేస్తున్నారు.

### ఏటా గణనీయమైన ఆదాయం..

జిల్లా గనుల శాఖ గత రెండేండ్లుగా భారీగా ఆదాయాన్ని పొందుతున్నది. జిల్లాలోని గనుల్లో ఖనిజాల ఉత్పత్తులు పెరగడంతో అదే రీతిలో ప్రభుత్వానికి ఆదాయం వస్తున్నది. జిల్లా వ్యాప్తంగా 109 వరకు క్వార్ట్జ్, గ్రానైట్, కంకర పరిశ్రమలు ఉన్నాయి. అయితే ప్రస్తుతం 97 మాత్రమే పనిచేస్తున్నాయి. రాయి, కంకర పరిశ్రమలు 51, బ్లాక్, కలర్ గ్రానైట్ పరిశ్రమలు 15, పలుగు రాయి, ఫెల్డ్ స్పార్ పరిశ్రమలు 43 వరకు వినియోగంలో ఉన్నాయి. చేవెళ్లలో హస్తేపూర్, అనంతవరంలలో రెండు లేటరైట్ పరిశ్రమలు నడుస్తున్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం లీజు డబ్బులను ఆయా పరిశ్రమల యజమానుల నుంచి గనులు, భూగర్భ శాఖ వసూలు చేస్తున్నది. 2022-23 సంవత్సరంలో రూ.154.65కోట్ల ఆదాయం రాగా, 2023-24 సంవత్సరానికి సంబంధించి జనవరి నాటికే అనూహ్యంగా రూ.96కోట్లు వచ్చింది. ఇంకా మార్చి వరకు సమయం ఉండగానే ఇంత మొత్తం ఆదాయం రావడంతో అదనంగా మరో రూ.10 కోట్లు సమకూర్చుకునే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

### అక్రమాలపై కొరడా..

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనుమతులు, లీజుల రెన్యువల్‌కు ఆన్‌లైన్ విధానాన్ని అమల్లోకి తెచ్చాక గనుల తవ్వకాల్లో అక్రమాలు చాలా వరకు తగ్గుముఖం పట్టాయి. అయినా.. కొన్ని చోట్ల అక్రమాలు జరుగుతూనే ఉన్నాయి. అనుమతులు ఒక చోట పొంది మరొక చోట తవ్వకాలు జరపడం.. పొందిన అనుమతుల కంటే ఎక్కువ విస్తీర్ణంలో ఖనిజాన్ని వెలికితీయడం వంటి ఉదంతాలు అడపాదడపగా చోటు చేసుకుంటున్నాయి. గ్రానైట్ అక్రమ రవాణా సైతం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో మైనింగ్ శాఖ అధికారులు దాడులను ముమ్మరం చేసి అక్రమాలకు చెక్ పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కేసులు నమోదు చేయడంతోపాటు జరిమానాలను విధిస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటివరకు సుమారు రూ.50లక్షల వరకు జరిమానాల రూపంలో వసూలైంది.

### జిల్లా అభివృద్ధిలో గనుల శాఖ కీలకపాత్ర..

జిల్లా అభివృద్ధిలో గనులు, భూగర్భ శాఖ కీలక పాత్ర పోషిస్తున్నది. గనుల యజమానులు ఏటా ప్రభుత్వానికి చెల్లించే సీనరేజ్ చార్జీపై 30 శాతాన్ని 'జిల్లా ఖనిజ సంక్షేమ నిధి'కి జమ చేస్తూ వస్తున్నారు. ఈ నిధులతో మైనింగ్ ప్రభావిత ప్రాంతాల సమగ్రాభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకుగాను సంక్షేమ పథకాల అమలుకు చర్యలు చేపడుతున్నారు. క్వారీ లీజుల ద్వారా ఇప్పటివరకు గనులు, భూగర్భ శాఖ జిల్లా 'ఖనిజ నిధి'కి రూ.111.75కోట్ల ఆదాయం వచ్చింది. జిల్లా ప్రజాప్రతినిధులు, జిల్లా ఖనిజ కమిటీ సభ్యుల సూచనల మేరకు కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ నిధుల కేటాయింపు జరుగుతున్నది. జిల్లాలో విద్య, వైద్యం, గ్రామీణ రోడ్లు, స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన కార్యక్రమాల అమలుకు ఈ నిధులను వెచ్చిస్తున్నారు.

### భారీ సంస్కరణలతో అధిక ఆదాయం ..



సమైక్య రాష్ట్రంలో రంగారెడ్డి జిల్లాలో వృద్ధిరేటు తిరోగమనంలో ఉండగా.. తెలంగాణలో ఆదాయ వృద్ధి కనిపిస్తున్నది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో గనులు, భూగర్భ శాఖలో భారీ సంస్కరణలను తీసుకురావడమే ఇందుకు కారణం. ఈ ఏడాది జిల్లాలో గనుల లీజు రూపంలో లక్ష్యానికి మించి పెద్ద ఎత్తున ఆదాయం సమకూరింది. మైనింగ్ అక్రమ రవాణా తదితర విషయాల్లో కేసులు నమోదు చేసి జరిమానాలను విధిస్తున్నాం.

-ప్రవీణ్ రెడ్డి, గనులు, భూగర్భ శాఖ సహాయ సంచాలకులు, రంగారెడ్డి జిల్లా

### జిల్లాలో ఖనిజ వనరుల వివరాలు ఇలా...

| ఖనిజం పేరు | లీజుల సంఖ్య |
|---|---|
| క్వార్ట్జ్, ఫెల్డ్ స్పార్ | 43 |
| గ్రానైట్ | 15 |
| కంకర, రాయి | 51 |
| లేటరైట్ | 2 |



పెద్దేముల్ మండలం జనగాం-మంబాపూర్ గ్రామాల మధ్య శిథిలావస్థకు చేరి పూర్తిగా ధ్వంసమైన కోట్‌పల్లి ప్రాజెక్టు కెనాల్ తూము



# ఆధునీకరణ అంతే సంగతులు

## కోట్‌పల్లి ప్రాజెక్టు మరమ్మతులకు గ్రహణం

- కేసీఆర్ ప్రభుత్వం గతేడాది బడ్జెట్‌లో నిధుల కేటాయింపు
- అంతలోనే సాధారణ ఎన్నికలు రావడంతో నిధుల మంజూరుకు బ్రేక్
- తాజా బడ్జెట్‌లో కోట్‌పల్లి ప్రాజెక్టు ఊసెత్తని కాంగ్రెస్ సర్కార్
- పూర్తిగా దెబ్బ తిన్న ప్రాజెక్టు ఎడమ, కుడి, బేబి కాలువలు, తూములు
- ప్రాజెక్టులో సమృద్ధిగా నీరున్నా సాగుకు వాడుకోలేని దుస్థితి
- ప్రస్తుతం 5,500 ఎకరాలకే అందుతున్న సాగునీరు. మరమ్మతులు చేస్తే 15వేల ఎకరాలకు..

**'అంగట్లో అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని' అన్న చందంగా తయారైంది కోట్‌పల్లి ప్రాజెక్టు ఆయకట్టు కింద ఉన్న రైతుల పరిస్థితి. ఇందులో సమృద్ధిగా నీరున్నా పంటల సాగుకు వాడుకోలేని దుస్థితి నెలకొన్నది. కొన్నేండ్లుగా వర్షాలు సమృద్ధిగా కురవడంతో నీటి నిల్వలు మెండుగా ఉన్నాయి. అయినా కాలువలు, తూములు శిథిలావస్థకు చేరడంతో నీరు పారే పరిస్థితి లేదు. ఇప్పటివరకు కనీస మరమ్మతులకు నోచుకోకపోవడమే ఇందుకు కారణం.**

**-వికారాబాద్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ)**

యాభై ఏండ్ల క్రితం నిర్మించిన కోట్‌పల్లి ప్రాజెక్టు కాలువలు పూర్తిగా దెబ్బతినడం, తూములు కొట్టుకుపోవడం, బ్రిడ్జిలు కూలిపోవడం రైతుల పాలిట శాపంగా మారింది. కేసీఆర్ ప్రభుత్వం చివరి బడ్జెట్‌లో కోట్‌పల్లి ప్రాజెక్టు ఆధునీకరణకు నిధులు కేటాయించడంతో అధికారులు అంచనాలు పూర్తి చేసి ప్రభుత్వానికి అందజేశారు. అయితే అంతలోనే ఎన్నికలు రావడంతో నిధుల మంజూరుకు బ్రేక్ పడింది. అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టు ఆధునీకరణ ఊసే లేకపోవడం గమనార్హం. ఇప్పటికే అంచనాలు పూర్తి చేసి సంబంధిత శాఖ ఈఎన్సీ వద్ద ఉన్న ప్రాజెక్టు ఆధునీకరణ ఫైల్ విషయంలో వికారాబాద్, తాండూరు ఎమ్మెల్యేలు కదలిక తీసుకువస్తారో లేదో వేచిచూడాలి. మరోవైపు జిల్లాలో ఉన్న ఒకే ఒక్క మధ్యతరహా ప్రాజెక్టు ఇది అని, త్వరగా నిధులు మంజూరు చేసి సాగునీరందించాలని వికారాబాద్, తాండూరు నియోజకవర్గాల రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

### ప్రస్తుతం 5500 ఎకరాలకే సాగునీరు...

జిల్లాలో ప్రాజెక్టులు, ప్రధాన చెరువుల నుంచి వెళ్లే కాలువలు పూర్తిగా పాడై సాగు నీరందించే పరిస్థితి లేదు. కోట్‌పల్లి ప్రాజెక్టుకు గత రెండుమూడేండ్లుగా భారీగా వరద వస్తుండడంతో ప్రాజెక్టు కింద ఉండే కాలువలన్నీ కొట్టుకుపోయాయి. దీంతో ఈ ప్రాజెక్టు నుంచి చాలా తక్కువ విస్తీర్ణంలో సాగు నీరందిస్తున్నారు. కోట్‌పల్లి ప్రాజెక్టు ద్వారా తాండూరు, వికారాబాద్ నియోజకవర్గాల్లోని 18 గ్రామాలకు సాగునీరు అందించాల్సి ఉండగా.. మరమ్మతులకు నోచుకోని కారణంగా కేవలం 7 గ్రామాల పరిధిలో కేవలం 5500 ఎకరాలకే సాగునీరు అందుతున్నది. ఎడమ కాలువ ద్వారా రుద్రారం, గట్టేపల్లి, కుడి కాలువ ద్వారా నాగసముందర్, మాన్‌సాన్‌పల్లి, జనగాం, మంబాపూర్, మారెపల్లితండా గ్రామాలకు సాగు నీరందుతున్నది. 1.57 టీఎంసీల సామర్థ్యంగల కోట్‌పల్లి ప్రాజెక్టులో పుష్కలంగా నీరున్నా కాలువలు, తూములు దెబ్బతినడంతో రైతులకు నష్టం జరుగుతున్నది. దీన్ని గమనించిన తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ప్రాజెక్టు ఆధునీకరణకు గత ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడంతో వెంటనే స్పందించింది. జల వనరుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వి.ప్రకాష్‌తో పాటు అధికారుల బృందాన్ని పంపి ఏయే పనులు చేపట్టాలనే సమగ్ర నివేదికను అందజేయాలని సూచించింది. అంతేకాకుండా ప్రాజెక్టు మరమ్మతులకు కేసీఆర్ ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ కూడా ఇచ్చింది. దీంతో అధికారులు రూ.110 కోట్ల నిధులతో కోట్‌పల్లి ప్రాజెక్టు ఆధునీకరణతోపాటు ఆనకట్ట బలోపేతం, కుడి, ఎడమ, బేబి కాలువల పునర్నిర్మాణం, పాత బ్రిడ్జిల స్థానంలో కొత్తవి నిర్మించడం తదితర మరమ్మతులకు అంచనాలను తయారు చేశారు.

### మరమ్మతులతో 15 వేల ఎకరాలకు పైగా నీరు..

కోట్‌పల్లి ప్రాజెక్టు కుడికాలువ ద్వారా 8100 ఎకరాలు, ఎడమ, బేబి కాలువల ద్వారా 1100 ఎకరాలకు నీరందించే సామర్థ్యమున్నా కాలువలు, తూములు దెబ్బతినడంతో అది సాధ్యం కావడం లేదు. ప్రాజెక్టును పూర్తిస్థాయిలో ఆధునీకరిస్తే 15 వేల ఎకరాలకుపైగా సాగు నీరందించే అవకాశాలున్నట్లు జిల్లా నీటి పారుదల శాఖ అధికారులు చెబుతున్నారు.

### 1964లో కోట్‌పల్లి ప్రాజెక్టుకు శంకుస్థాపన...

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1964లో అప్పటి సీఎం మర్రి చెన్నారెడ్డి పెద్దేముల్ మండలంలోని కోట్‌పల్లి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టును కేవలం మూడేండ్లలోనే పూర్తి చేసి సాగునీరందించారు. కోట్‌పల్లి ప్రాజెక్టు 24 అడుగుల లోతు, 1784 ఎకరాల్లో విస్తరించి ఉన్నది. కుడి కాలువ కింద ధారూర్ మండలంలోని నాగసముందర్, అల్లాపూర్, రుద్రారం, బూర్గుగడ్డ, గట్టేపల్లి, ఎడమ కాలువ కింద పెద్దేముల్ మండలంలోని మాన్‌సాన్‌పల్లి, బుద్దారం, పెద్దేముల్, మారెపల్లి, దుగ్గాపూర్, రుక్మాపూర్, కొండాపూర్, ఖానాపూర్, రేగొండి, మదవంతాపూర్, జనగాం, మంబాపూర్, తింసాన్‌పల్లి గ్రామాలున్నాయి. బేబి కాలువ కింద నాగసముందర్, బూర్గుగడ్డ గ్రామాల ఆయకట్టుకు సాగునీరందించేలా నిర్మించారు.



బొంరాస్‌పేట మండలంలోని చెట్టుపల్లితండా కేజీబీవీలో ఇంటర్నల్ మార్కులను పరిశీలిస్తున్న బృందం

## పదోతరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల పరిశీలన

బొంరాస్‌పేట, ఫిబ్రవరి 19 : వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల పరిశీలన సోమవారం నుంచి ప్రారంభమైంది. మార్కుల పరిశీలనకు డీఈవో జిల్లాలోని వివిధ పాఠశాలల జీహెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లతో 17 బృందాలను ఏర్పాటు చేశారు. వీరు తమకు కేటాయించిన పాఠశాలలకు వెళ్లి పదో తరగతి విద్యార్థులకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు కేటాయించిన ఇంటర్నల్ మార్కులను పరిశీలిస్తున్నారు. పదోతరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులకు ఒక్కో సబ్జెక్టుకు 80 మార్కులు, ఇప్పటికే నిర్వహించిన ఎఫ్‌ఏ-1, ఎఫ్‌ఏ-2 పరీక్షలు, విద్యార్థులకు ఇచ్చిన ప్రాజెక్టుల వర్కులు, నోటు పుస్తకాల్లో విద్యార్థుల చేతిరాతను బట్టి ఉపాధ్యాయులు 20 ఇంటర్నల్ మార్కులు కేటాయిస్తారు. ఈ మార్కుల కేటాయింపు సక్రమంగానే జరిగిందా లేదా అనే విషయాలను ప్రత్యేక బృందాలు పాఠశాలలకు వెళ్లి తనిఖీ చేస్తున్నాయి

### జిల్లాలో 17 బృందాలు ఏర్పాటు

వచ్చే నెలా 18 నుంచి జరిగే ఎస్సెస్సీ వార్షిక పరీక్షలకు వికారాబాద్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 13,456 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. అదేవిధంగా ఈ నెల 22 నుంచి ప్రీ-ఫైనల్ పరీక్షలను నిర్వహించనున్నారు. వీటికి ముందే అంతర్గత మార్కుల పరిశీలన పూర్తి చేయాలన్న ఉద్దేశంతో జిల్లాలో 17 తనిఖీ బృందాలను ఏర్పాటు చేశారు. వీరంతా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వెళ్లి విద్యార్థుల అంతర్గత మార్కులను పరిశీలిస్తారు. బొంరాస్‌పేట జీహెచ్‌ఎం హరిలాల్ నేతృత్వంలో నామ్యానాయక్, శివరాజ్, అభయకుమార్‌తో ఏర్పాటు చేసిన బృందం చౌదర్‌పల్లి, హకీంపేట, కేజీబీవీ పాఠశాలలను, దుద్యాల హెచ్‌ఎం నెహ్రూచౌహాన్ నేతృత్వంలో శ్రీకాంత్, మల్లప్పలతో ఏర్పాటు చేసిన బృందం రేగడిమైలారం, బొట్లవానితండా ఆశ్రమ పాఠశాల, చిల్‌ముల్‌మైలారం మైనార్టీ గురుకుల పాఠశాలలకు, చౌదర్‌పల్లి హెచ్‌ఎం శ్రీహరిరెడ్డి నేతృత్వంలో రవీందర్, శివకుమార్‌లతో ఏర్పాటు చేసిన తనిఖీ బృందం బొంరాస్‌పేట, దుద్యాల, కుదురుమల్ల ఉన్నత పాఠశాలలను సందర్శించి ఇంటర్నల్ మార్కులను పరిశీలిస్తారు.

## వందశాతం దిశగా..

- గ్రామ పంచాయతీల్లో జోరుగా పన్నుల వసూలు
- రంగారెడ్డి జిల్లాలో మొత్తం 558 జీపీలు
- ఈ ఏడాది పన్ను వసూలు లక్ష్యం రూ.35.95కోట్లు
- ఇప్పటివరకు రూ.22.18కోట్లు వసూలు
- మార్చి 31లోగా వందశాతం రాబట్టేలా కార్యాచరణ



షాబాద్ మండలం సోలీపేట్‌లో ఇంటి పన్నులు వసూలు చేస్తున్న పంచాయతీ కార్యదర్శి

షాబాద్, ఫిబ్రవరి 19 : గ్రామ పంచాయతీల్లో పన్నుల వసూళ్లపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. వందశాతం పన్నులు వసూలు చేయడమే లక్ష్యంగా ప్రణాళికను అమలు చేస్తున్నారు. ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు పచ్చదనం, పారిశుద్ధ్య నిర్వహణ, ఇంటింటికీ తాగునీటిని అందిస్తున్నది. వాటి ప్రయోజనాలను పొందుతున్న ప్రజలు సకాలంలో ఇంటి పన్నులు చెల్లిస్తున్నారు. రంగారెడ్డి జిల్లాలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇప్పటివరకు 61.7శాతం ఇంటి పన్నులు వసూలయ్యాయి. ఈ ఏడాది మార్చి 31లోగా వందశాతం లక్ష్యాన్ని చేరుకునేలా సంబంధిత శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

### రూ.22.18 కోట్లు వసూలు..

జిల్లా వ్యాప్తంగా చేవెళ్ల, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు(కల్వకుర్తి), మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, ఎల్బీనగర్ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 558 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కాగా, 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను పన్ను వసూలు లక్ష్యం రూ. 35.95 కోట్లు ఉండగా, ఇప్పటివరకు రూ.22.18 కోట్లు పన్నులను అధికారులు వసూలు చేశారు. మరో రెండు నెలల్లో లక్ష్యాన్ని అధిగమించేందుకు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు నిత్యం పన్నులను వసూలు చేస్తున్నారు. వసూళ్లలో వెనుకబడిన మండలాల్లో ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నారు.

### 40 రోజుల గడువు...

జిల్లాలో పన్నుల వసూళ్లపై పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వందశాతం పన్నులు వసూలు చేసేందుకు ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ప్రతిరోజూ గ్రామాలకు వెళ్లి పన్నులను రాబడుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు ఇంకా 40 రోజులు మిగిలి ఉండడంతో అంతలోపు వందశాతం పన్నుల వసూళ్లను పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. రోజువారీ పన్నుల వసూళ్ల నివేదికను జిల్లా అధికారులకు పంపిస్తున్నారు. పన్నుల వసూళ్లలో వెనుకబడిన పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి సలహాలు, సూచనలు ఇస్తూ వందశాతం లక్ష్యాన్ని చేరుకోవాలని చర్యలు తీసుకుంటున్నారు.

### వందశాతం పూర్తి చేస్తాం..

జిల్లాలోని 558 గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నుల వసూలు వేగవంతంగా జరుగుతున్నది. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇప్పటివరకు 61.7శాతం పన్నుల వసూలు పూర్తయ్యింది. ఇటీవల తమ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి పన్నులు వసూలుపై దిశానిర్దేశం చేశాం. రోజువారి పన్నుల వసూలు టార్గెట్ ఇచ్చాం. ఎక్కడైనా టాక్స్ తక్కువగా ఫిక్స్ చేసి ఉంటే ప్రస్తుత రేట్ ప్రకారం ట్యాక్స్ ఫిక్స్ చేసి వసూలు చేయిస్తున్నాం. ఈ ఏడాది మార్చిలోగా వందశాతం లక్ష్యాన్ని చేరుకునేలా పటిష్ట కార్యాచరణ అమలు చేస్తున్నాం.

-సురేశ్‌మోహన్, రంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి